క్లుప్తంగా

జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకట సుబ్బయ్య

ఉయ్యాలవాడ : ప్రస్తుతం గ్రామాలలో జ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి వెంకటసుబ్బయ్య సూచించారు. మండల పరిధిలోని తుడుమల దిన్నె గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా ఉయ్యాలవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది 104 వాహనంలో ఆ గ్రామం చేరుకుని వైద్య పరీక్షలు నిర్వహించారు. 95 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరాలు, దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ క్రిష్ణ, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కస్తూర్బాను సందర్శించిన తహసీల్దార్



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న ఎస్‌ఓ అంజనమ్మ

ఉయ్యాలవాడ : మండల పరిధిలోని పుచ్చకాయలపల్లె కస్తూర్బా బాలికల పాఠశాలను మంగళవారం ఈఓపీఆర్డీ మహేంద్రారెడ్డితో కలిసి తహసీల్దార్ శ్రీనివాసులు సందర్శించారు. విద్యార్థినులకు కావాల్సిన మౌలిక వసతులపై ఎస్‌ఓను తహసీల్దార్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు అవసరాలకు వినియోగించిన వృథా నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేక పాఠశాల పక్కనే నిలిచిపోతున్నందున ఇబ్బందిగా ఉందని ఎస్‌ఓ వివరించగా పరిష్కార చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

దొర్నిపాడు: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవాలు నిర్వహించారు. క్రిష్టిపాడు గ్రామంలో టీటీడీ బహూకరించిన శ్రీకృష్ణ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ఇస్కాన్ సంస్థ చైతన్య ప్రభుజీ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

కేజీబీవీలో వసతులపై ఆరా



కేజీబీవీ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థుల వసతులపై మండల ప్రత్యేక అధికారి, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి నాగరాజు ఆరా తీశారు. మంగళవారం ఆయన ఎంపీడీఓ మధుసూదనరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర ప్రసాదు, పీఆర్ ఏఈ వెంకటరాముడులతో కలిసి కేజీబీవీని సందర్శించారు. రికార్డులను పరిశీలించిన ప్రత్యేక అధికారి వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. భోజనం మెనూ ప్రకారం అందుతోందా లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వసతులు, భోజనం మంచిగా ఉన్నాయని విద్యార్థులు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: మండల పరిధిలోని దీబగుంట్ల జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు సైకిళ్లను ప్రిన్సిపాల్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. దాతలు గుళ్ల సుదర్శనం శెట్టి, అన్నపురెడ్డి లింగారెడ్డి ఎనిమిదిమంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలి

గోస్పాడు: మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ షేక్ మొహిద్దీన్, ఎంపీడీఓ నాగ అనసూయ, ఎంఈఓ అబ్దుల్‌కరీం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎస్‌ఎంసీ చైర్మన్లకు మధ్యాహ్న భోజన పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. బడి మానేసిన పిల్లలు ఓపెన్ స్కూల్ ద్వారా చదువుకోవాలని, ఈ సర్టిఫికెట్స్ రెగ్యులర్ విద్యతో సమానమని చెప్పారు.

కఠిన చట్టాలు రూపొందించాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి సంఘటనలు మళ్లీ ఎక్కడా జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు జరగకుండా చట్టాలను కఠినతరం చేయాలి. రాత్రి వేళలో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బందికి రక్షణ అవసరం. మహిళల భద్రతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి.

–డాక్టర్ సునీత, ఇన్‌చార్జి డీపీఎంఓ, నంద్యాల

మెరుగైన వసతులు కల్పించాలి



ఆస్పత్రిలో వందలాది మంది స్టాఫ్‌నర్సులు, మహిళా వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పని చేస్తున్నారు. పని చేసే ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు భద్రత ఏర్పాటు చేయాలి. వైద్యులు, సిబ్బందిపై దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలోని ఆర్‌జీకార్ వైద్యశాలలో జూనియర్ డాక్టర్ అత్యాచారం ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి.

–ప్రసన్నలక్ష్మి, ఇన్‌చార్జి డీఐఓ, నంద్యాల

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

- విద్యుత్ కనెక్షన్లకు కూడా పర్మిషన్ తీసుకోవాలి
- నిమజ్జన మహోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి,



హాజరైన పలు శాఖల అధికారులు

నంద్యాల(అర్బన్): వినాయక చవితి సందర్భంగా మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. వినాయక చవితి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా శాంతియుత వాతావరణంలో విగ్రహాల నిమజ్జనం జరిగేలా ఇప్పటి నుంచే పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 11వ తేదీ స్థానిక చిన్నచెరువు కట్ట వద్ద ఉన్న వినాయక ఘాట్‌లో గణేష్ నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నంద్యాల పట్టణంలో గణేష్ మండపాల ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్ నుంచి, విద్యుత్ కనెక్షన్లకు ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. సుమారు 500 వినాయక విగ్రహాలు నిమజ్జనం కానున్నట్లు అధికారులు వెల్లడిస్తున్న నేపథ్యంలో స్థానిక చిన్న చెరువు, కేసీ కెనాల్, కుందూనది ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లకు ప్లాట్‌ఫామ్, క్రేన్లు, లైటింగ్, బారికేడింగ్, పుట్టీలతో స్విమ్మర్లు, వైద్య శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న చెరువు ప్లాట్‌ఫామ్ బలహీనంగా ఉందని పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఊరేగింపు ప్రదేశాల్లోని ముఖ్య కూడళ్లలో తాగునీటి వసతితో పాటు పారిశుద్ధ్య పనులు చేయాలని తెలిపారు. భారీ గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వీలుగా అవసరమైన క్రేన్లను ఏర్పాటు చేయాలన్నారు. గాంధీ చౌక్, చిన్న చెరువు సమీపంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గణేష్ విగ్రహాలు తరలించే మార్గాలైన మున్సిపల్ ఆఫీసు, సంజీవనగర్ గేటు, శ్రీనివాస సెంటర్, సిటీ బస్టాండ్, గాంధీచౌక్, కల్పనా సెంటర్, బైర్మల్ వీధి, బంగారు అంగళ్ల వీధి, రాజ్ థియేటర్, టెక్కె, సాయిబాబానగర్, కోవెలకుంట్ల జంక్షన్, బొమ్మలసత్రం తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చించి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా మాట్లాడుతూ.. రూట్ మ్యాప్ ప్రకారం గణేష్ విగ్రహాల ఊరేగింపునకు పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ మాట్లాడుతూ.. సంబంధిత శాఖలు సమన్వయంతో గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వ్యాయామ విద్యావిభాగం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం ఉత్సవాల్లో భాగంగా ఫిట్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతోపాటు టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థినీ, విద్యార్థులు రాణించాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ సూచించారు.

30న వాహనాల వేలం

బొమ్మలసత్రం: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 30వ తేదీ స్థానిక సెబ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు సీఐ విశ్వనాథ్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూనెపల్లి సమీపంలోని సెబ్ పోలీస్టేషన్ ఆవరణలో సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట జరుగుతుందని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు సెబ్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కుందూనదిలో గుర్తుతెలియని శవం

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు శివారులోని కుందూనదిలో గుర్తుతెలియన శవం ఉన్నట్లు గ్రామస్తులు మంగళవారం గుర్తించారు. వయసు సుమారు 45 వరకు ఉండవచ్చని పేర్కొన్నారు. తలకు పూర్తిగా వెంట్రుకలు తొలగిపోవడంతో కేవలం పుర్రెమాత్రమే ఉన్నట్లు చెప్పారు. ఈమేరకు ఏఎస్‌ఐ రంగయ్య ఘటన స్థలానికి చేరుకుని మృత దేహన్ని పరిశీలించారు. మృత దేహన్ని వెలికితీస్తే కానీ పూర్తి వివరాలు తెలిసేలా లేవు.

నేత్రదానం చేయండి



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అంధత్వనివారణ అధికారి

శిరివెళ్ల: నేత్రదానం చేయాలని జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మహదేవపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో 15 మిలియన్ల మంది అంధత్వంతో బాధ పడుతున్నారన్నారు. అందులో 6 నుండి 8 మిలియన్ల మంది కార్నియల్ బ్లైండ్నెస్ అనగా నల్లగడ్డు అంధత్వంతో బాధపడుతున్నారన్నారు. వీరిలో 8 లక్షల మంది చిన్నారులున్నారు. మరణాంతరం నేత్రాలను దానం చేస్తే నల్లగుడ్డు అంధత్వంతో బాధ బాధపడుతున్న వారిలో తిరిగి కంటి చూపు వస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణరెడ్డి, వైద్య సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మాధవి

నేత్రదానంపై అవగాహన

నంద్యాల(వ్యవసాయం): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక ఆయుష్ యోగా కేంద్రంలో నేత్రదానంపై అంధత్వ నివారణ సంస్థ అధికారిణి డాక్టర్ మాధవి అవగాహన కల్పించారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి నేత్రాలను, ఇతర అవయవాలను సేకరిస్తారని తెలిపారు. సహజ మరణమైన వారి నుంచి కార్నియాను మాత్రమే సేకరిస్తారన్నారు. దృష్టి లోపం ఉన్న వారికి అమర్చి చూపు తెప్పిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఆనంద్‌గురూజీ, దస్తగిరి, మారుతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు

ఉయ్యాలవాడ : మండలంలోని గ్రామపంచాయతీలకు నిధులు మంజూరయ్యాయని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండవ విడత నిధులు గ్రామ పంచాయతీల వారీగా ఇలా ఉన్నాయి. అల్లూరు గ్రామ పంచాయతీకిరూ. 2,88,604, బోడెమ్మనూరు - రూ. 2,15,619, హరివరం - రూ. 3,57,223, ఇంజేడు -రూ. 2,04,122, కాకరవాడ - రూ. 1,88,646, కొండుపల్లె -రూ. 1,56,367, మాయలూరు పంచాయతీకి రూ. 2,06,469 మంజూరయ్యాయి. అదేవిధంగా నర్సిపల్లె గ్రామపంచాయతీకి రూ. 1,22,462, పెద్దయమ్మనూరు - రూ. 2,48,564, ఆర్.జంబులదిన్నె - రూ. 2,09,191, ఆర్.పాంపల్లె - రూ. 1,92,546, రూపనగుడి -రూ. 1,58,917, సర్వాయిపల్లె -రూ. 1,40,784, తుడుమలదిన్నె -రూ. 1,78,857, ఉయ్యాలవాడ - రూ. 5,09,651, సుద్దమల్ల -రూ. 84,845, పడిగెపాడు -రూ. 66,507, ఎస్.కొత్తపల్లె -రూ. 49,347, పుచ్చకాయలపల్లె - రూ.69,585, గోవిందపల్లె గ్రామ పంచాయతీకి రూ. 64,789 చొప్పున మంజూరయ్యాయని వివరించారు. ఈ నిధులు ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లతో సమావేశం నిర్వహించి నిధులు వ్యయం చేయాలని కార్యదర్శులకు ఎంపీడీఓ సూచించారు.

ఫ్రీ హోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయొద్దు

- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఫ్రీ హోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దని కలెక్టర్ రాజకుమారి సబ్ రిజిస్ట్రార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌తో కలిసి సబ్ రిజిస్ట్రార్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిషేధిత ఆస్తుల జాబితాకు సంబంధించి సెక్షన్ 22 ఏ పరిధిలోకి వచ్చే అసైన్డ్ భూములు, గవర్నమెంట్ ల్యాండ్స్, దేవాలయ భూములకు సంబంధించి అన్యాక్రాంతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారసత్వం ప్రకారం సంక్రమించే ఇంటి స్థలాలు, ఇండ్లు మొదలైన వాటికి లింక్ దస్తావేజులు లేనప్పుడు మండల తహసీల్దార్ లేదా మండల డెవలప్‌మెంట్ అధికారులతో ధ్రువీకరణ పత్రం జారీ చేసే విధంగా ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ పద్మజ, జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి, సబ్ రిజిస్ట్రార్‌లు పాల్గొన్నారు.

ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్‌బాబు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రణత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో లెనిన్‌బాబు మాట్లాడారు. డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం 2కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలని, నిరుద్యోగ భృతి 40సంవత్సరాల వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి విషయంలో కూటమి ప్రభుత్వం ఆంక్షలు విధించడం తగదన్నారు. సమావేశంలో సీపీఐ ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సుంకయ్య, నాగరాముడు, రవి, విష్ణు, మధు, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాసులు

నంద్యాల(అర్బన్): విద్యార్థులకు అందించే స్టడీ మెటీరియల్‌ను చదివి మంచి మార్కులు సాధించాలని చాపిరేవుల జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీనివాసులు అన్నారు. వరల్డ్ విజన్ ఇండియా సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ జెస్సీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెట్రో ల్యాబ్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాల కోసం స్కిల్ ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధికారి ప్రతాపరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఐటీఐలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఏసీ టెక్నీషియన్, డిగ్రీలో బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. అభ్యర్థులందరూ విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9440224291 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆళ్లగడ్డలో త్వరలో వంద పడకల ఆసుపత్రి

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డలో త్వరలో వంద పడకల ఏరియా ఆసుపత్రిని తీసుకు రానున్నట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రస్తుతం 50 పడకల వైద్యశాలను త్వరలో 100 పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యులు, సిబ్బంది రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందుబాటులో ఉండాలని సూచించారు.

22వేల చెత్త బుట్టలు మంజూరు

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు కలిపి 22వేల చెత్తబుట్టలు మంజూరైనట్లు ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ తెలిపారు. మంగళవారం లారీలో బుట్టలు ఎంపీడీఓ కార్యాలయం చేరుకున్నాయి. రేషన్ కార్డుల ఆధారంగా మండలంలోని అన్ని పంచాయతీలకు పంపిణీ చేస్తామన్నారు. ఒక్కో రేషన్ కార్డు దారుకు రెండు బుట్టల చొప్పున ఇస్తామని చెప్పారు.

29న 3కె రన్

నంద్యాల(సెంట్రల్): క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో ఈ నెల 29వ తేదీ ఉదయం 6:30 గంటలకు త్రీకె రన్ నిర్వహించనున్నట్లు నంద్యాల క్రీడాభారతి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. అనంతరం క్రీడల్లో రాణించిన క్రీడాకారులను సన్మానించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా, డీఎస్పీ గిరిధర్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

స్వామిప్రభు పాదుల జయంతి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక శ్రీనివాస సెంటర్‌లోని శ్రీజగన్నాథ మందిరంలో ఏసీ భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులవారి 128వ జయంతిని నిర్వహించారు. నిర్వాహకులు నరసింహ ప్రభుదాసు ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామి వారికి దర్శన హారతి, అనంతరం శ్రీల ప్రభుపాద లీలామృత ప్రవచనం నిర్వహించారు. మధ్యాహ్నం పుష్పాంజలి నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి మహానైవేద్యాన్ని సమర్పించారు. సాయంత్రం సంధ్యాహారతి, శ్రీమద్ భగవద్గీత ప్రవచనాలు నిర్వహించారు.

రాయితీపై యూరియా సరఫరా చేయాలి

నంద్యాల(న్యూటౌన్): మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలు, రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై యూరియా సరఫరా చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, రామచంద్రుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. సబ్సిడీ యూరియా రూ.260కు ఇవ్వాల్సి ఉండగా రూ.350కి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఆగస్టు 19వ తేదీ నాటికి జిల్లాలో 19,710 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం రైతులకు అందడం లేదన్నారు.

వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఎంపీకి తగదు

నంద్యాల(న్యూటౌన్): రైతు ఉద్యమాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు తగదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న అన్నారు. మంగళవారం నంద్యాలలో ఆయన మాట్లాడుతూ.. ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. రైతులందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించే ఫిర్యాదులను 24 గంటల్లోపు పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పీజీఆర్‌ఎస్ కమాండ్ కంట్రోల్ కో–ఆర్డినేషన్ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదులను నిర్ణీత కాలపరిమితి కంటే ముందుగానే పరిష్కరించాలని సూచించారు. సమస్య పరిష్కారం కాకముందే సంబంధిత అధికారి లాగిన్ నుంచి పంపకూడదన్నారు. సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిస్థాయి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు, మండలాధికారులు ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే కమాండ్ కంట్రోల్ రూమ్ కో ఆర్డినేషన్ టీం నుంచి సహాయం పొందవచ్చని తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, డీఎల్‌డీఓ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



ఎస్పీజీ గ్రౌండ్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న క్రీడాభివృద్ధి అధికారి రాజు

నంద్యాల(న్యూటౌన్): ఆగస్టు 29న హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును పురస్కరించుకుని మంగళవారం నంద్యాలలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వాలీబాల్, టెన్నిస్, క్రికెట్ హాకీ, ఖోఖో, త్రోబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. హాకీ చాంపియన్‌షిప్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజు పోటీలను ప్రారంభించారు. మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో ఎస్‌డీఆర్ పాఠశాల విద్యార్థులు విజయం సాధించారని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి తెలిపారు. ఎస్పీజీ క్రీడా మైదానంలో జరిగిన హాకీ ఫైనల్ పోటీల్లో ఎస్పీజీ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అలాగే హాకీ మహిళల పోటీల్లో సంతజూటూరుకు చెందిన జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు విజయం సాధించారు. అలాగే ప్రభుత్వ పాలిటెక్నిక్ క్రీడా మైదానంలో జరిగిన ఖోఖో పోటీల్లో పురుషులు నాలుగు జట్లు, మహిళలు రెండు జట్లు తలపడగా కేశవరెడ్డి స్కూల్ జట్టు విజయం సాధించిందన్నారు. గురురాజ పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన త్రోబాల్ పోటీల్లో గురురాజ విజేతగా నిలవగా త్రోబాల్ మహిళల పోటీల్లో గుడ్‌షెపర్డ్ విజయం సాధించిందన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నంద్యాల స్టేడియంలో జరిగిన వాలీబాల్ పురుషుల పోటీల్లో కేశవరెడ్డి విద్యార్థులు విజయం సాధించారు. అలాగే వాలీబాల్ మహిళల పోటీల్లో కేఎస్‌ఎం మున్సిపల్ పాఠశాల విద్యార్థులు విజయం సాధించినట్లు ఆయన వివరించారు. విజేతలకు ఈనెల 29వ తేదీన బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.

కనుల పండువగా మహానందీశ్వరుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మహానందిలో కొలువైన శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వరస్వామివార్ల కల్యాణ మహోత్సవం మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో అర్చకులు స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, అక్షింతల సమర్పణ, మాంగళ్యధారణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.